సాక్షి
నారాయణపేట
బుధవారం । 14 । ఆగస్టు । 2024



బకాయిలు చెల్లిస్తాం
విత్తనోత్పత్తి బకాయిలు త్వరలో చెల్లిస్తామని కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు.
వివరాలు 8లో ▸



నిలిచిన విద్యుదుత్పత్తి
జూరాలకు ఎగువ నుంచి వరద తగ్గడంతో విద్యుదుత్పత్తి నిలిపివేశారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /25.6

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత పెరుగుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేది వీరే..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ఉమ్మడి పాలమూరులోని జిల్లాల్లో జాతీయ పతాకాలు ఆవిష్కరించే వారి జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయా జిల్లాలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జోగుళాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర **ప్రభుత్వ సలహా** దారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, **నాగర్‌కర్నూల్** జిల్లాలో ప్రణాళికా సంఘం **ఉపాధ్యక్షుడు** చిన్నారెడ్డి, నారాయణపేట**లో తెలంగాణ** పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ **చైర్మన్ గురునాథ్** రెడ్డి, వనపర్తిలో తెలంగాణ **రాష్ట్ర షెడ్యూల్** కులాల కో ఆపరేటివ్ డెవల**ప్‌మెంట్ కార్పొరే** షన్ చైర్మన్ ప్రీతమ్‌లు **జాతీయ పతాకాన్ని** ఆవిష్కరించనున్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం



మక్తల్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఐసీడీఎస్, పల్లె దవాఖాన, తహసీల్దార్ అతిథిగృహం భవనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రంలో వివిధ శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. రూ. 2 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం సైతం అసంపూర్తిగా ఉందన్నారు. డిగ్రీ కళాశాల స్టేడియంలో కొనసాగుతుందన్నారు. అన్ని కార్యాలయాలతో పాటు డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి మక్తల్ కోర్టును మారుస్తామన్నారు. 8 ఎకరాల విస్తీర్ణంలో 150 పడకల ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ పనుల పూర్తికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం కన్వీనర్ నాగరాజుగౌడ్, మున్సిపల్ కమిషన ర్ భోగేశ్వర్, ఎంపీడీఓ రమేష్, ఏపీఓ రహిమ తుల్లా, సీడీపీఓ సరోజినీ మట్ట, సూపర్‌వైజ ర్లు రామేశ్వరి, మల్లేశ్వరి నారాయణ్, గణేష్‌కుమార్, రవికుమార్, నాగేందర్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి పరిశీలించారు. పెద్ద నగరాల్లో మాదిరిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేయడంతో చిరు వ్యాపారులకు అక్కరకు రాకుండా పోయిందన్నారు. ప్రజాధనం వృథా కాకుండా మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ కమిషనర్, ఇంజినీర్లకు ఎమ్మెల్యే సూచించారు. మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే విధంగా మార్కెట్‌ను ఇతరులకు అద్దెకు ఇచ్చే అవకాశాలు ఉంటే చూడాలన్నారు. అనంతరం హైదరాబాద్ రోడ్డులోని బీసీ కాలనీ పక్కన కొత్తగా నిర్మించిన మున్సిపల్ పార్కును పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, కౌన్సిలర్లు సలీం, అమీరుద్దీన్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

నారాయణపేట రూరల్: పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని డీవైఎస్‌ఓ వెంకటేష్‌శెట్టి సూచించారు. అశ్రమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నజట్రం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పరీక్ష ప్యాడ్లు, చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ.. రోజు ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభించడంతో పాటు చురుకుదనం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు మైదానం వైపు కొంత దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రం నిర్వాహకురాలు క్రాంతిరేఖ, సంస్థ ప్రతినిధి నరేష్, హెచ్‌ఎం మహేష్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ సుజాత, నర్సింహా, అంజనేయులుగౌడ్, నరేష్ పాల్గొన్నారు.



ఈ ఫొటోలోని రైతు పేరు పాలెపల్లి హన్మయ్య. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం వెన్నాచేడ్‌కు చెందిన ఆయనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2020 జూన్ 29న ఎస్‌బీఐలో రూ.66 వేల పంట రుణం తీసుకున్నాడు. ప్రతి ఏటా రెన్యూవల్ చేస్తూ వచ్చాడు. కానీ అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్ హయాంలో ఆయనకు నిరాశే ఎదురైంది. దీంతో సదరు రైతు అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నాడు. పై నుంచి వచ్చిన లిస్ట్ ప్రకారమే ఇస్తున్నాం.. మిగతా విషయాలతో మాకు ఎలాంటి సంబంధం లేదని బ్యాంకర్లు చెబుతుండడంతో నిస్సహాయంగా వెనుదిరగడం ఆయనకు నిత్యకృత్యమైంది.



ఈ ఫొటోలోని రైతు పేరు గురుహన్మంతు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన ఆయనకు ఎకరంన్నర వ్యవసాయ భూమి ఉంది. 2018లో స్థానిక ఎస్‌బీఐలో పంట రుణం కింద రూ.55 వేలు తీసుకున్నాడు. రెండు విడతలుగా ప్రభుత్వం రుణమాఫీ చేసినా.. ఆయనకు వర్తించలేదు. దీంతో నిత్యం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. బ్యాంక్ అధికారులు అకౌంట్ నంబర్ తప్పుగా పంపించారని వ్యవసాయాధికారులు చెబుతుండగా.. మాకేం సంబంధం లేదని బ్యాంకర్లు తప్పించుకుంటున్నారు. దీంతో అధికారులు చేసిన తప్పునకు నన్ను బలి చేస్తారా అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

....ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులై ఉండి రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న వారిలో ఈ ఇద్దరు రైతులే కాదు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా **ఇంకా వేలాది మంది ఉన్నారు.**

సారు.. మాఫీ ప్లీజ్ !

రుణమాఫీ కోసం పలువురు రైతుల ఎదురుచూపులు

- అర్హులమైనా.. బ్యాంకర్ల తప్పిదాలతో నోచుకోలేదని ఆవేదన
- రేషన్‌కార్డు ప్రామాణికం కాదంటూ మోసం చేస్తారా అని ఆక్రోశం
- నిత్యం బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- సహకార సంఘాల పరిధిలోనే అధిక శాతం బాధితులు
- 3వ విడత పూర్తయ్యాకే స్పష్టత వస్తుందని భావిస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తొలి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.1.50 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయగా.. మూడో విడతలో రూ.2 లక్షల లోపు మాఫీ చేసేందుకు సన్నద్ధమైంది. రెండు దఫాలుగా జరిగిన రుణమాఫీలో అర్హులైన పలువురు రైతులకు భంగపాటు ఎదురుకాగా.. వారిలో ఆందోళన నెలకొంది. అటు వ్యవసాయాధికారులు, ఇటు బ్యాంకర్ల చుట్టూ నిత్య ప్రదక్షిణలు చేస్తుండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సరిదిద్దుతున్నామని, మళ్లీ ప్రభుత్వానికి పంపుతామని అధికార యంత్రాంగం చెబుతున్నప్పటికీ.. అనేక అనుమానాలతో అన్నదాతలు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. అర్హులై ఉండి.. వివిధ కారణాలతో రుణమాఫీకి నోచుకోని రైతులందరికీ న్యాయం చేస్తామనే స్పష్టమైన హామీ సర్కారు నుంచి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డీసీసీబీ పరిధిలో మొత్తం 68,495 మంది రైతులు రూ.476.84 కోట్ల రుణాలు తీసుకున్నారు. ఇందులో రూ.లక్షలోపు రుణాలకు సంబంధించి 51,417 మంది రైతులకు రూ.236.55 కోట్లు మాఫీ కావాలి. కేవలం 20,130 మంది రైతులకు రూ.92.02 కోట్లు మాత్రమే మాఫీ కాగా.. 31,277 మంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. రూ.1.50 లక్షల పంట రుణాలకు సంబంధించి 11,041 మంది రైతులకు రూ.129.58 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ 9,479 మందికి రూ.67.92 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. ఈ లెక్కన రెండు విడతల్లో కలిపి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో అధికంగా 32,839 మంది రైతులకు మొండిచేయి ఎదురైనట్లు తెలుస్తోంది. మొత్తంగా అన్ని బ్యాంకుల్లో కలిపి రూ.1.50 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న వారిలో సగం మంది రైతులకు రుణమాఫీ రాలేదని అంచనా. ఇప్పటివరకు చేసిన రుణమాఫీ ప్రక్రియలో ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు తప్పుగా నమోదు చేయడం, బ్యాంక్ ఖాతా, ఆధార్ పేర్లు సరిపోలకపోవడంతో పాటు రేషన్‌కార్డులో పేర్లు లేకపోవడం, కుటుంబం యూనిట్‌గా తీసుకోగా.. కుటుంబాల్లో వ్యక్తుల పేర్లు మార్పిడి కావడం వంటి కారణాలతో పలువురికి రుణమాఫీ కాలేదు.

డీసీసీబీ పరిధిలోనే అధికం..

■ జడ్చర్ల సహకార బ్యాంకు పరిధిలో బాదేపల్లి, బాలానగర్, భూత్పూర్, పోల్కంపల్లి సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు సంబంధించి మొత్తం 874 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్షలోపు 388 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. రూ.1.50 లక్షల లోపు 123 మందికి రుణమాఫీ జరిగింది. మొత్తంగా 874లో 511 మందికి రుణమాఫీ జరిగింది. రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న వారు పోనూ ఇంకా వందలాది మంది రైతులకు రుణమాఫీ వర్తించని పరిస్థితి ఉంది.

రేషన్‌కార్డు లేదని మాఫీ చేయలేదట..



నాకు 2.25 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వెన్నాచేడ్ ఎస్‌బీఐలో 2021లో రూ.లక్ష పంట రుణంగా తీసుకున్నా. ప్రతి ఏటా రెన్యువల్ చేశా. రెండు జాబితాల్లోనూ నా పేరు లేదు. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే రేషన్‌కార్డు లేదు.. అందుకే రాలేదు.. మేం ఏం చేయలేమని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్తే ఆన్‌లైన్‌లో కుటుంబ నిర్ధారణ జరగాల్సి ఉందంటూ చూపిస్తోందని.. పై అధికారులకు పంపిస్తామని చెప్పారు. రుణమాఫీకి, రేషన్‌కార్డుకు లింక్ లేదని ప్రభుత్వం చెప్పింది. నాకు రుణమాఫీ వర్తింపజేయాలి.

– కావలి అంజనేయులు, చెల్మిల్ల, గండీడ్

ఏఈఓలకు వివరాలు ఇవ్వండి...



నిబంధనల ప్రకారం అర్హులై ఉండి రుణ మాఫీ వర్తించకపోతే సదరు రైతులు ఏఈఓలను సంప్రదించాలి. భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలతో ఫిర్యాదు చేయాలి. వివరాలన్నింటినీ ఏఈఓలు గ్రీవెన్స్ కింద సేకరించి మండల అధికారికి అందజేస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల నుంచి అర్హులై ఉండి రాని వారి జాబితా సేకరిస్తున్నాం.

– ఫనీషా, ఉమ్మడి గండీడ్ మండల వ్యవసాయాధికారి

సీఎంఆర్ అప్పగించడంలో అలసత్వం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రైస్‌మిల్లర్లు నిర్ణీత గడువులోగా **సీఎంఆర్ అప్పగించా**లని కలెక్టర్ సిక్తా పట్నా**యక్ ఆదేశించారు.** మంగళవారం కలెక్టరేట్‌లోని **సమావేశ మందిరం**లో రైస్‌మిల్లర్లు, పౌరసరఫరాల **శాఖ డిప్యూటీ త**హసీల్దార్లతో సమీక్ష నిర్వహిం**చారు. ఈ సందర్భం**గా కలెక్టర్ మాట్లాడుతూ.. **2021–22 వానాకా**లం సీఎంఆర్ సకాలంలో అం**దించడంతో పాటు** 2022–23 వానాకాలానికి సం**బంధించిన సీఎంఆర్** సెప్టెంబర్ మొదటి వారం **లోగా అప్పగించా**లని అన్నారు. మరాడించిన **బియ్యాన్ని ఎఫ్‌సీఐకి** నిర్ణీత సమయంలో చేరవేయడంలో అలసత్వం వహించకూడదన్నారు. మిల్లర్ల యాజమాన్యాలు, యూనియన్ నాయకులు ఒక్క తాటిపైకి వచ్చి సీఎంఆర్ నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అధికారులు రైస్‌మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా బియ్యం మిల్లింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్లు రోజువారీ టూర్ డైరీలలో ఏఏ మిల్లులను సందర్శించారో నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ అశోక్ సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ సుదర్శన్, డీఎం దేవదాస్, రైసు మిల్లర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా శ్రీరాములు, మాజీ అధ్యక్షుడు సంతోష్, హర్ష, భరత్ ఉన్నారు.

■ జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. కేంద్రంలోని స్టాఫ్ రూమ్, కౌన్సెలింగ్ గదిని పరిశీలించారు. సఖి కేంద్రం మొదటి అంతస్తులో గల షీటీం కార్యాలయాన్ని పరిశీలించి, షీటీం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను తెలుసుకున్నారు. సఖి కేంద్రానికి వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కారాలపై ఆరా తీశారు. ప్రధానంగా బాల్యవివాహాల నివారణకు చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. అలాగే పోక్సో కేసులు, లైంగిక వేధింపుల కేసుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం సఖి చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్‌ను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా బాల సదన్‌ను కలెక్టర్ సందర్శించారు. బాలసదన్‌లో చిన్నారులతో ముచ్చటించి, వివరాలు తెలుసుకున్నారు. అరుణ్ అనే బాలుడితో ఓ పద్యం చదివించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ జయాబాయి, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో ఏసీబీ దాడులు

- అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు
- నాసిరకమైన వంట సామగ్రి ఉందని అధికారుల వెల్లడి



వసతిగృహంలో కిరాణ సామగ్రిని పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/కోయిల్‌కొండ: జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో ఏసీబీ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, జడ్చర్లలో పలు గురుకుల్లాలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. ఈ నేపథ్యంలో కోయిల్‌కొండ మండలకేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌పై మంగళవారం ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు హాస్టల్‌కు ఏసీబీ అధికారులతో పాటు ఆహార నాణ్యత తనిఖీ అధికారులు, ఆడిట్ శానిటేషన్ అధికారులు చేరుకున్నారు. విద్యార్థులు ఉపయోగించే గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. అల్పాహారం, జీరో రైస్‌లో నాణ్యత లేదని గుర్తించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాం, ఆట వస్తువులు బయటకు తీయలేదని గుర్తించారు. అనంతరం డీఎస్పీ కృష్ణగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, కిరాణ సామగ్రి కూరగాయలు, రాగులు, కందిపప్పు నాసిరకంగా ఉన్నాయని తెలిపారు. బియ్యంలో పురుగులు ఉన్నాయన్నారు. 120 మంది విద్యార్థులకు 80 మంది హాజరయ్యారని, హాస్టల్‌లో రికార్డుల నమోదు సరిగా లేదన్నారు. సంబంధిత వార్డెన్ అందుబాటులో లేరని ఆయన ఫోన్ పనిచేయడం లేదని తెలిపారు. ఈ హాస్టల్ పరిస్థితిని ఏసీబీ డైరెక్టర్‌కు నివేదిక అందిస్తామని వెల్లడించారు. ఈ క్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారిని ఇందిరా అక్కడికి చేరుకుని వార్డెన్ ఇంటికి సిబ్బందిని పంపించి అతన్ని తీసుకొచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు చేరుకున్న వార్డెన్ అధికారులకు పలు అంశాలపై సమాధానం ఇచ్చినట్లు సమాచారం. తనిఖీల్లో ఏసీబీ సీఐలు జిలాని, లింగస్వామి, ఇతర అధికారులు విజయ్‌కుమార్, కుమారస్వామి, బీసీ సంక్షేమ అధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నారాయణపేట: జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులు, స్టేషన్ రైటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. న్యాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల విచారణలో ఏ అంశాలు క్రోడీకరించాలనే అంశాలను వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేసి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రతి కేసులో పారదర్శకంగా సమగ్ర విచారణ ఉండాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి, ఫైనల్ చేయాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరిత గతిన విచారణ పూర్తిచేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కేసుల ఛేదనలో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 17న కోస్గిలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఎన్.లింగయ్య, సీఐలు శివశంకర్, దస్రూనాయక్, రాంలాల్, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

యూనిఫామ్స్ త్వరగా అందించాలి



ఊట్కూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ త్వరగా అందించాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. మంగళవారం ఊట్కూర్‌లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫామ్స్ కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి యూనిఫామ్స్ తయారీ వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి యూనిఫాం అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఏపీఎం నిర్మల, ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు రెండు రకాల బీమా సౌకర్యం

- ప్రమాద, రుణ ఇన్సూరెన్స్‌లతో భరోసా
- 18 నుంచి 60 ఏళ్ల వయసున్న వారికి వర్తింపు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

అతివలకు ధీమా!

జిల్లాలో ఇలా..

మొత్తం సంఘాలు	పాత సంఘాలు
8,084	7,500
కొత్తవి	**సభ్యులు**
584	90,748 మంది



నర్వలో మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం చంద్రశేఖర్ (ఫైల్)

నర్వ: స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక స్వావలంబనకు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అనేక పథకాలు అమలుచేస్తోంది. మహిళలను అన్ని రంగాల్లో చైతన్యపరుస్తూ.. ఆర్థికంగా నిలుదొక్కుకునేలా చర్యలు చేపడుతోంది. వేలాది మంది మహిళలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, పొదుపు ఖాతా, గ్రామ, మండల సమాఖ్య రుణాలు అందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తోంది. తాజాగా మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాల సభ్యులందరికీ ప్రమాద, రుణ బీమా సౌకర్యం కల్పించింది.

సంఘాల్లో సభ్యురాలై ఉండాలి..
బీమా పథకం కోసం తప్పనిసరిగా డ్వాక్రా సంఘాల్లో సభ్యురాలై ఉండాలి. గతంలో సభ్యురాలైనప్పటికీ ఎలాంటి బీమా సౌకర్యం ఉండేది కాదు. దీంతో పాటు వివిధ పథకాలలో రుణాలు తీసుకుంటేనే తప్ప, బీమా వర్తించేది కాదు. తాజా ఉత్తర్వుల ప్రకారం సంఘాల్లో రుణాలు తీసుకోనప్పటికీ.. సభ్యురాలైన ప్రతి మహిళకు బీమా సౌకర్యం కల్పించనున్నారు.

90,748 మంది మహిళలకు లబ్ధి..
జిల్లాలోని 11 మండలాల్లో పాత సంఘాలు 7,500 ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మరికొన్ని మహిళా సంఘాలను చేర్చుకున్నారు. మొత్తం 8,084 సంఘాలకు గాను 90,748 వేల మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘం సభ్యురాలైన ప్రతి మహిళకు బీమా వర్తించనుంది. సంఘం సభ్యురాలు ప్రమాదవశాత్తు మృతి చెందితే, ఆమె కుటుంబానికి రూ.10 లక్షల బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ వంద శాతం వైకల్యం కలిగితే రూ. 10 లక్షలు, 50 శాతం వైకల్యానికి రూ.5 లక్షల బీమా చెల్లిస్తారు. మృతిచెందిన మహిళకు బ్యాంకు రుణం ఉంటే, అది కూడా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలిపే సదరం ధ్రువపత్రం, చికిత్స పొందిన ఆస్పత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం, పోలీసుల విచారణ రిపోర్టులు ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న పొదుపు మహిళలకు బీమా వర్తింపజేస్తారు.

■ ప్రస్తుతం ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే, వడ్డీతో కలిపి ఆమె కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది. అలా చెల్లించకపోతే ఈ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణ బీమా వర్తింపజేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే, ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.

నిబంధనలు..

■ స్వయం సహాయక మహిళా సంఘంలో సభ్యులుగా ఉండి 18–60 ఏళ్ల వయసు ఉన్న ప్రతి మహిళ ఈ పథకానికి అర్హురాలు.
■ సభ్యురాలి వయసు తెలియజేసే ఆధార్, ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత ధ్రువపత్రం, పాన్‌కార్డు, పాస్‌పోర్టు ఇలా ఏదో ఒక గుర్తింపు కార్డుతో దరఖాస్తు చేసి, సభ్యత్వం పొందవచ్చు.
■ సంఘంలోని సభ్యుల తీర్మానం ప్రకారం బీమా పథకంలో చేరాలి.
■ ఒక సంఘంలో ఉన్న సభ్యులందరూ పథకంలో చేరాలన్న నియమం లేదు. సభ్యురాలికి నచ్చితేనే బీమా నమోదు చేయించుకోవచ్చు.
■ సురక్ష బీమా పథకంలో చేరిన సభ్యురాలు మరణిస్తే, తక్షణ సాయంగా అదే రోజు రూ.5 వేలను అందిస్తారు. మిగతా రూ. 95 వేలను గ్రామ సమాఖ్య ద్వారా ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లాలో 8,084 సంఘాలు ఉన్నాయి. సభ్యులందరూ తప్పనిసరిగా బీమా నమోదు చేయించుకోవాలి. మహిళలకు రెండు రకాల బీమా సౌకర్యం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. మహిళలకు రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. బీమా సౌకర్యంపై మహిళలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మొగులప్ప, డీఆర్డీఓ

క్లుప్తంగా

పొలంలో పనులు చేస్తూ ఉపాధ్యాయుడి మృతి


బాల్‌రాజ్(ఫైల్)

నవాబుపేట: రుక్కంపల్లికి చెందిన మరికంటి బాల్‌రాజ్(50) అనే ఉపాధ్యాయుడు తన పొలంలో పనులు చేసుకుంటూ మంగళవారం ఒక్కసారిగా అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వివరించారు. కాగా బాల్‌రాజ్ తన పొలంలో పంటలకు పురుగుల మందు స్ప్రే చేస్తుండగా కుప్పకూలి పడిపోయాడని స్థానికులు అన్నారు. అయితే మందుల ప్రభావమా.. గుండెపోటా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఆయన ఇప్పటూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘానికి గతంలో మండల అధ్యక్షుడిగా, తాజాగా జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. బాల్‌రాజ్ మృతిపట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

రైలు పట్టాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలపై సమీపంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న ఓ వ్యక్తిని చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని మోతీనగర్ దగ్గర ఉన్న రైలు పట్టాల దగ్గర మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి(35) తీవ్ర గాయాలతో కింద పడిపోయాడు. డ్యూటీలో ఉన్న రైల్వే సిబ్బంది చూసి చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా క్షతగాత్రుడిని పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారం లేదని, మృతుడి కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చికిత్సపొందుతూ కారు డ్రైవర్..

మహబూబ్‌నగర్ క్రైం: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ కారు డ్రైవర్..ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన ఓ కారు డ్రైవర్(32) ఈనెల 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి భార్యకు ఫోన్‌కు చేసి చెప్పాడు. దీంతో ఆమె వెంటనే ఇంటికి చేరుకుని భర్తను జనరల్ ఆస్పత్రికి తరలించగా..అక్కడి చికిత్స చేయించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అయితే మృతుడికి పెళ్లి కాక ముందు ఓ మహిళతో పరిచయం ఉండగా.. ఆమెను కాదని మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని మృతుడిపై ఫిర్యాదు చేసింది. ఈ కేసు కోర్టు పరిధిలో ఉండగా జూలై 3న మృతుడు కోర్టుకు హాజరైన క్రమంలో సదరు మహిళ ఇకపై తనతో కలిసి ఉండకపోతే జైలు శిక్ష పడే విధంగా చేస్తానని కారు డ్రైవర్‌ను బెదిరించింది. దీంతో ఇంటికి వచ్చిన తర్వాత అతనువిషయం మొత్తం భార్యకు చెప్పి బాధపడ్డాడు. ఈ క్రమంలోనే ఈ నెల 7న ఉదయం 9గంటల ప్రాంతంలో పిల్లలను స్కూల్ దగ్గర, భార్యను పని దగ్గర దింపి ఇంటికి చేరుకుని అప్పటికే తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు



గోపాల్‌పేట: మండల కేంద్రానికి సమీపంలో మంగళవారం రాత్రి ఓ కారు బోల్తా పడగా.. నలుగురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ శంకర్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి ఏదుల మండలంలోని మాచుపల్లిలో పెళ్లికి వెళ్తున్నారు. గోపాల్‌పేట సమీపంలోకి వచ్చాక ప్రమాదవశాత్తు కారు కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సీఐ కుటుంబ సభ్యులు ముగ్గురు, డ్రైవర్ గాయాలపాలయ్యారు. వెంటనే చుట్టుపక్కల వారు గమనించి వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రమాద తీవ్రత తక్కువగా ఉందని, సీఐ ఉదయమే పెళ్లికి చేరుకున్నారని తెలిసింది.

విద్యార్థి ఆత్మహత్యపై కేసు నమోదు

జడ్చర్ల: కావేరమ్మపేటకు చెందిన వడ్డె వంశీ(19) ఆత్మహత్యపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి సమీపంలో గల ఓ కళాశాలలో వంశీ బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి సోమవారం మధ్యాహ్నం కావేరమ్మపేటలోని ఇంటికి చేరుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. కాగా ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చన్నారు.

విత్తనోత్పత్తి బకాయిలను త్వరలో చెల్లిస్తాం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి


మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వనపర్తి: ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన విత్తనోత్పత్తి రైతుల బకాయిలను త్వరలో చెల్లిస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాష్ట్ర విత్తనశుద్ధి కర్మాగారాన్ని ఆయన సందర్శించారు. గత ప్రభుత్వం విత్తనాలపై సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసిందని తెలిపారు. అలాంటి పొరపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోదన్నారు. రైతులకు మంచి చేయాలని ఉద్దేశ్యంతో కార్పొరేషన్ పనిచేస్తుందన్నారు. రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలపై అధికారులతో చర్చించి సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విత్తన సంస్థల ప్రకటనలను చూసి రైతులు మోసపోవద్దని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే విత్తన కర్మాగారాల్లో నాణ్యమైన విత్తనాలు తయారు చేస్తారన్నారు. కార్పొరేషన్ అందించిన విత్తనాలతో రైతులకు ఏవిధమైన నష్టం కలిగితే కార్పొరేషన్‌తో పాటు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. చైర్మన్‌ను రైతులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయవాదం పెంపొందించడమే లక్ష్యం

నారాయణపేట: ప్రజల్లో జాతీయవాదం పెంపొందించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ నేతృత్వంలో తిరంగా ర్యాలీ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగూరావు నామాజీ, కె.రతంగ్‌పాండు రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు కలిసి భారీర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, చిట్టెం నర్సిరెడ్డి తదితరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమన్నారు. ఇలాంటి దాడులు సరికావని ఖండించారు. 2047 కల్లా మన దేశాన్ని విశ్వగురుగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రధానికి అండగా ఉందామన్నారు. సంఘ విద్రోహ శక్తుల దాడులను సహించబోమన్నారు. భారత్‌లోకి చొరబడేందుకు కొందరు యతిస్తున్నారని.. అలాంటి కుట్రలను సాగనియకుండా మోదీ ప్రభుత్వం సరిహద్దులో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన మనమంతా ఐక్యంగా ఉండాలి జాతీయ సమైక్యతను చాటాలని కోరారు. గోవర్ధన్ గౌడ్, వెంట్రాములు, కెంచె శ్రీనివాసులు, భాస్కర్, సిద్ది వెంకట్రాములు, సత్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

నిలిచిన విద్యుదుత్పత్తి


సుంకేసుల డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం కేవలం 17 వేల క్యూసెక్కులు వస్తుండగా.. ఆవిరి రూపంలో 91, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వకు 681, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు మొత్తం 2,657 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 9.111 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

107 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల జలాశయానికి వరద తగ్గుముఖం పట్టడంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ఆగుతూ.. సాగుతూ అన్నట్లు ఉంది. మంగళవారం ఎగువన 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, దిగువన 5 యూనిట్ల ద్వారా 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఇప్పటి వరకు 107.925 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు. ప్రస్తుతం 18 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుదుత్పత్తి చేపడుతున్నామని తెలిపారు.

సుంకేసులలో 18 గేట్లు ఎత్తివేత..

రాజోళి: సుంకేసుల జలాశయం 18 గేట్లను తెరిచి దిగువకు నీటిని వదులుతున్నారు. మంగళవారం ఎగువ నుంచి 80,060 క్యూసెక్కుల వరద వస్తుండగా.. దిగువకు 77,598 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు జేఈ రాజు తెలిపారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు చెప్పారు.


దిగువ జూరాల పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న నీరు

శ్రీశైలంలో నీటిమట్టం 880.8 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 880.8 అడుగుల వద్ద 192.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 77,598 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ.. 37,540 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ.. 30,671 మొత్తం 68,211 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 25వేల, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌కు 1,397 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.731 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. కుడిగట్టు విద్యుత్తు కేంద్రంలో 15.384 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గద్వాల క్రైం: సమస్యలపై వచ్చే బాధితుల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఏఎస్పీ గుణశేఖర్ సూచించారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఏఎస్పీ, సీఐ భీంకుమార్‌లు రూరల్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. ఇటీవల సంగాలలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ కింద పడి కూలీమృతి చెందిన కేసు విచారణపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన విచారణలో అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు సైతం వెల్లిన నేపథ్యంలో ఏఎస్పీ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. గతంలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన అధికారి తీరు, విధుల్లో చేపట్టిన చర్యలపై సమగ్ర విచారణ దిశగా ఈ ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు తెలిసింది. అనంతరం సిబ్బంది పని తీరుపై ఎస్‌ఐ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిత్యం గస్తీ నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డయల్ 100 కాల్స్ విషయంలో త్వరగా స్పందించాలన్నారు.

'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై రూపొందించిన 'మా వాటా మాకే' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలోగల గ్రీన్‌బెల్టులోని వివిధ విగ్రహాల దగ్గర ప్రముఖ బీసీ నాయకులు కార్యక్రమం నిర్వమించారు. పీపీ బెక్కం జనార్దన్ మాట్లాడారు. రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులుగా పనిచేసిన జూలూరు గౌరిశంకర్ రచించిన 'మా వాటా మాకే' పుస్తకం బీసీ రిజర్వేషన్ల గురించి ఎంతో విలువైనదని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా బీసీల బతుకులు మారడం లేదన్నారు. దేశజనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు అధికారానికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. బీసీలందరూ సంఘటితమై కలిసి కట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఒక్కొక్క విగ్రహం దగ్గర ఒక్కొక్క బీసీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.లక్ష్మణ్‌గౌడ్, రాష్ట్ర మేదరి సంఘం ప్రతినిధి కందూరి వెంకట్రాములు, మాజీ విద్యాశాధికారి డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, జిల్లా పతంజలి యోగా సమితి అధ్యక్షుడు గంగాధర్, బీసీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగం, ఎన్.ప్రభాకర్, బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అశ్విని చంద్రశేఖర్, కొప్పోలు యాదయ్య, రమేష్‌గౌడ్, చంద్రమౌళి, బోల యాదయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ కలెక్టర్ మంచు నగేష్


అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టరేట్ నగేష్

అమరచింత: జూరాల ప్రాజెక్టు పరిసరాలు, నదితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. రెవెన్యూ అధికారులు సైతం ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ నగేష్ సూచించారు. మంగళవారం ఆయన ప్రాజెక్టును సందర్శించి బ్యాక్ వాటర్ నిల్వ సామర్థ్యాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి వరద అధికంగా రావడం లేదని.. దీంతో క్రస్ట్ గేట్లను మూసివేసినట్లు అధికారులు వివరించారు. వర్షాకాలం వరకు దిగువ నది పరీవాహక ప్రాంత ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని.. నదిలో చేపలు పట్టడం, పశువులను నీరు తాగించేందుకు తీసుకెళ్లడం వంటివి చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ రమేష్‌రెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

భూమి పరిశీలన..

ఆత్మకూర్: పట్టణ శివారులోని సర్వేనంబర్ 485లో రికార్డులో 11 ఎకరాలు, మోఖాలో 14.30 ఎకరాలు ఉందని.. మిగతా 3.30 ఎకరాల భూమి రికార్డులో చేర్చాలంటూ మహిళా రైతు దరఖాస్తు చేసుకుంది. దీంతో మంగళవారం అదనపు కలెక్టర్ నగేష్ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రికార్డులో, మోఖాలో వ్యత్యాసం ఉండటం చాలా అరుదని.. పూర్తిస్థాయిలో పరిశీలించామని తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మల్లాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రముఖ వేదపండితుడు వెంకటశేషశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట సర్వే ల్యాండ్ రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ బాలకృష్ణ, తహసీల్దార్ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీతాఫలానికి అంతర్జాతీయ గుర్తింపు తేవాలి


రైతులకు కూరగాయల విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

నవాబుపేట: సీతాఫలానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని.. అందుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని.. కొండాలక్ష్మణ్ బాపూజీ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సైదయ్య సూచించారు. మంగళవారం కొల్లూర్‌లో పాలమూర్ రైతు డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇక్కడ లభిస్తున్న సీతాఫలాలకు ప్రత్యేక డిమాండ్ ఉందన్నారు. అందుకే ఇక్కడి సీతాఫలానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ సిస్టం కార్యక్రమం ఇటీవల ప్రారంభించినట్లు వివరించారు. సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్ వారి సహకారంతో ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మండలంలోని వివిధ గ్రామాల రైతులకు కూరగాయల విత్తనాలు, ఎరువులు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌రావు, సైంటిస్టులు పూర్ణిమ, రాణి, రాంరెడ్డి, గజేందర్, తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధులు తవ్వుతూ..


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

- బండరాయి పైన పడటంతో వ్యక్తి దుర్మరణం
- ఎనిమిది మందికి రిమాండ్

కొడంగల్ రూరల్: గుప్తనిధుల వేటలో ఒకరు మృతి చెందగా మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పట్టణంలోని సీఐ కార్యాలయ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. మే 21న బొంరాస్‌పేట మండలం నాందార్‌పూర్ శివారులో బ్రిడ్జి దగ్గర కుళ్లిన స్థితిలో కుమ్మరి సత్యప్ప మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు కుమ్మరి నరేశ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా బొంరాస్‌పేట ఠాణాలో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా దోమ మండలం దాదాపూర్‌కు చెందిన మృతుడు సత్యప్ప ఫోన్‌కాల్ లిస్ట్ ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పాలాస్ సత్తయ్య(సత్యనారాయణ) హైదరాబాద్‌లోని అంబర్‌పేట తురబ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈయన ఐదేళ్ల క్రితం భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో గుప్త నిధుల తవ్వకాలు చేపట్టగా ఎలాంటి నిధులు లభించలేదు. మహబూబ్‌నగర్ జిల్లా నస్కల్‌పేట గ్రామంలోని రాళ్లగుట్టలో నిధి ఉన్నట్లు తెలుసుకుని ఏడాది క్రితం అక్కడకు చేరుకున్నారు. ఏనుగు బొమ్మ, రాతి కట్టడం ఉందని నగరంలోని పాతబస్తీకి చెందిన తన గురువు షకీల్‌కు సత్యనారాయణ చెప్పాడు. అక్కడే నిధి ఉంటుందని గురువు చెప్పడంతో సత్యనారాయణతో పాటుగా మృతుడు సత్తయ్య, నారాయణపేట జిల్లా కోస్గి మండలం నాగసాన్‌పల్లికి చెందిన శంకరయ్య, నస్కల్‌పేట గ్రామస్తుడు నాగరాజు, సైదులు, వెంకటయ్య, శర్మ, సుందరయ్య, నిధి ఉన్నట్లు భావిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం సత్యప్ప, శంకరయ్య, నాగరాజు, వెంకటయ్య గుట్టను 18 ఫీట్ల లోతు తవ్వారు. ఎలాంటి నిధి లభించక పోవడంతో షకీల్‌ను అక్కడకు తీసుకువచ్చి చూపించారు. అడ్డం తవ్వితే నిధి లభిస్తుందని చెప్పడంతో మే 17న రాళ్లగుట్ట తవ్వుతున్న క్రమంలో సత్యప్పపై బండరాయి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వారు అదే రోజు రాత్రి పది గంటల సమయంలో శర్మ కారులో సత్యప్ప శవాన్ని బొంరాస్‌పేట మండలం నాందాపూర్ శివారులోని కల్వర్టు వద్దకు తీసుకొచ్చారు. శవాన్ని బైక్‌పై ఉంచి కల్వర్టుపై నుంచి కిందకు తోసేశారు. కాల్ హిస్టరీ ఆధారంగా శంకరయ్యను విచారించగా నేరం ఒప్పుకొన్నాడని సీఐ తెలిపారు. గుప్త నిధుల తవ్వకాల్లో మృతుడితో పాటుగా మరో ఎనిమిది మంది ఉన్నట్లు గుర్తించి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. ఒక కారు, ఎనిమిది సెల్‌ఫోన్లు, తవ్వకాలకు ఉపయోగించిన సామగ్రిని సీజ్ చేశామన్నారు. కేసును ఛేదించిన బొంరాస్‌పేట ఎస్‌ఐ రవూఫ్, సిబ్బంది బాలు, శ్రీనును సీఐ అభినందించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

- నలుగురికి గాయాలు


తుమ్మలపల్లి రోడ్డుపై అడ్డంగా పడిపోయిన ఆటో

గట్టు: కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి తుమ్మలపల్లి స్టేజీకి సమీపంలో మంగళవారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బల్గెర నుంచి అయిజ వైపు ట్రిప్ పైపులతో వెళ్తున్న ఆటో సీ బెలగల్ మండలం కమ్మంపాడుకు చెందిన నాగేష్, వాసు ద్విచక్ర వాహనంపై చాగదోన వైపు వెళ్తున్న క్రమంలో ఆటో, ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న నాగేష్, వాసుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు గాయపడ్డారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ : భార్యాభర్తలకు తీవ్రగాయాలు

మరికల్: ఆటో, బైక్ ఢీకొని భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బండతాండకు చెందిన భార్యాభర్తలు కిష్టనాయక్, తులసి మంగళవారం బైక్‌పై మరికల్‌కు వస్తుండగా రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఆటో వేగంగా ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పరారీ కావడంతో చుట్టపక్కల వాహనదారులు ఆటో డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడ్డ భార్యాభర్తలను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పచ్చిరొట్టతో భూమికి లాభాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


పొలాల్లో సాగు చేసిన జనుము

అలంపూర్: వరి సాగులో సేంద్రియ ఎరువులను తగు పాళ్లలో అందించడంలో రైతులు విఫలమవుతున్నారు. దీంతో పంటల దిగుబడి తగ్గిపోతుంది. మరికొన్ని రోజుల్లో వరి సాగుకు రైతులు సిద్ధం కాబోతున్నారు. ఈ పరిస్థితుల్లో పచ్చిరొట్ట ఎరువుల సాగుతో ఎన్నో మంచి ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు.

లాభాలు ఇలా..

పచ్చిరొట్ట వినియోగంతో ముఖ్యంగా భూమి గుళ్లబారుతుంది. అలాగే భూసారం కూడా బాగా పెరుగుతుంది. పొలానికి నీటిని, పోషక పదార్థాల నిల్వ ఉంచుకొనే శక్తి పెరుగుతుంది. మొక్కల వేర్లకు గాలి, నీరు పోషకాలు పుష్కలంగా అందుతాయి. జనుము, జీలుగలు, పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను, ఎరువులను తక్కువ ఖర్చుతోనే పెంచుకోవచ్చు. వీటి ద్వారా భూములను మరింత సారవంతంగా చేసుకోవచ్చు. భూమిలో ఆమ్ల, క్షార గుణాలను పెంపొందించుకోవచ్చు. మొక్కలకు సూక్ష్మ పోషకాల లోపాలు రాకుండా చూసుకోవడంతో పాటు పంట నాణ్యత, దిగుబడులు మెరుగుపడేందుకు పచ్చిరొట్ట మేలు చేస్తోంది. వీటితో చీడపీడల బెడద కూడా తగ్గుతుంది. పంటలో కలుపు మొక్కలను నివారించుకోవచ్చు. వర్షపు నీరు వృథాగా కాకుండా భూమిలో ఇంకేలా చేస్తోంది. పంటలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మ క్రిములు భూమిలో వృద్ధి పొందేందుకు దోహదపడుతుంది. పప్పు జాతి పచ్చిరొట్ట పైరుతో భూమిలో నత్రజనిని స్థిరీకరించి భూసారం అభివృద్ధి చెందుతుంది.

విత్తన ఎరువుల ఎంపిక..

పచ్చిరొట్ట పైరు బాగా పెరిగి, ఆకులు ఎక్కువగా, కాండం వచ్చి మెత్తగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా వీలైనంత వరకు లెగ్గింగ్ జాతి మొక్కలను పెంచడంతో వేర్లపైనే నత్రజని బుడిపెల ద్వారా గాలిలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. ఇవి త్వరగా కుళ్లిపోయే ప్రభావం కలిగి ఉంటాయి. ఇవి అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండటంతో నీటి ఎద్దడిని తట్టుకొని పెరుగుతుంది. పచ్చి రొట్ట పైర్ల వేర్లు భూమిలోకి చొచ్చుకొనిపోయే గుణం కలిగి ఉంటాయి. త్వరగా పెరిగి కలుపు మొక్కల పెరుగుదలను అరికట్టేందుకు ఉపయోగపడేలా చూసుకోవాలి.

జీలుగు సాగు :

పచ్చిరొట్ట ఎరువుల సాగు చేసుకుంటే భూమికి అవసరమైన సేంద్రియ పదార్థాల్ని అందిస్తాయి. వీటితో భూమిలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెందుతాయి. జీలుగలు ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనం కావాలి. పూత దశలో కోసినపుడు ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తోంది. ఒక టన్ను జీలుగ సాగులో ఐదు కిలోల నత్రజని, 1.5 కిలోల భాస్వరం, 4 కిలోల పొటాష్ వస్తుంది. చౌడు భూములకు బాగా పనికోస్తుంది.

జనుములు..

ఎకరానికి 20 కిలోల విత్తనం కావాలి. పూత దశ కంటే పంట వేసిన 8 వారాల తర్వాత కోసినప్పుడు 6 నుంచి 8 టన్నుల పచ్చిరొట్ట వస్తోంది. ఒక టన్ను జనుములో నాలుగు కిలోల నత్రజని, కిలో భాస్వరం, మూడు కిలోల పొటాష్ ఉంటుంది.

పిల్లి పెసర సాగుతో..

ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనం వేసుకోవాలి. పూత దశలో 4 నుంచి 5 టన్నుల పచ్చిరొట్ట ఇస్తోంది. దీనిని పరిశుభ్రంగా కూడా వాడుకోవచ్చు. ఒక టన్ను పిల్లి పెసరలో 4 కిలోల నత్రజనిని, కిలో భాస్వరం, 3 కిలోల పొటాష్ లభిస్తోంది. రైతులు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకొని భూముల్లో సేంద్రియ కర్బనం పెంపొందించుకోవాలి.